క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ

అనపర్తి: వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామానికి చెందిన మేడపాటి సుబ్బారెడ్డి ఆదివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఆదివారం అనపర్తిలో జరిగే సంతకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

గణపతికి ప్రత్యేక పూజలు

రంగంపేట: చంద్రేడులో కొలువైన గణపతి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం గణపతిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఏకాదశ దీక్షలు ప్రారంభం

అనపర్తి: మండలంలోని పొలమూరులో శ్రీకృష్ణ ఏకాదశ దీక్షలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం పూర్తయిన సందర్భంగా ఆలయ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని భక్తులు 11 రోజుల పాటు ఏకాదశ దీక్షను చేపట్టారు. వేద పండితులు వాడపల్లి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో దీక్షధారులు స్వామి వారి మాల ధారణ చేపట్టారు. ఆదివారం స్వామివారికి శాంతికర కల్యాణాన్ని వేడుకగా జరిపించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తి సూరారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తమలంపూడి వీరయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

28న ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: ఈ నెల 28వ తేదీన రంగంపేట విజయదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 28న శుక్రవారం అమ్మవారిని విశేషంగా అలంకరించి అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి ఆలయం వద్ద మహాన్నదానం నిర్వహించనున్నారు.

ఘనంగా కట్లమ్మ తల్లి మేలుకొలుపు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామ దేవత కట్లమ్మ తల్లి మేలుకొలుపు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి గరగ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మే 4న జాతర, 5వ తేదీన అమ్మవారి తీర్థానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి ఉన్నత పాఠశాల సమీపంలో ఐదు మద్యం బాటిళ్లు కలిగి ఉన్న నరాల రమణను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు ఆదివారం తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లలో 28 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. ముగ్గళ్ల గ్రామంలోని పిల్లి రత్నం ఇంటిలో అక్రమంగా వీటిని ఉంచారని, పక్కా సమాచారంతో దాడిచేసి, స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉపాధి వేతనం పెంపు

- రూ.272కు చేరిన రోజువారీ కూలి
- ఒక్క అనపర్తి నియోజకవర్గంలోనే 47,573 మందికి మేలు

ఉపాధి కూలీల వివరాలు

మండలం	జాబ్ కార్డుల సంఖ్య	పనిచేసే కూలీల సంఖ్య
అనపర్తి	5,532	8,041
బిక్కవోలు	8,566	13,174
రంగంపేట	9,918	13,669
పెదపూడి	8,132	12,688
మొత్తం	32,148	47,573

బిక్కవోలు: వలసల నివారణే ధ్యేయంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం గ్రామీణులకు వరంగా మారింది. గతంలో కన్నా పనులు ఎక్కువగా లభిస్తుండటంతో దాదాపుగా వలసలు తగ్గుముఖం పట్టాయి. పురుషులతో పాటు మహిళలకు సమాన వేతనం లభిస్తుండటంతో పనులకు మహిళా కూలీలు సైతం ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. గతంలో వేసవి కాలంలో పనిభారం అధికం కావడంతో హాజరు పెంపునకు పరిమితి కాలానికి అదనపు నగదు ప్రోత్సాహం ఇచ్చేవారు. ప్రస్తుతం పాత విధానానికి స్వస్తి పలికి రోజుకి రూ.15 చొప్పున పెంచి రూ.272 వేతనాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. గతంలో రోజుకి రూ.257 కూలి ఉండేది. ఏప్రిల్ నెల నుంచే వేతనదారులకు పెరిగిన వేతనం అందించనున్నారు. దీంతో ఒక్క అనపర్తి నియోజకవర్గంలోనే 47,573 మంది ఉపాధి కూలీలకు మేలు జరగనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీకి సంబంధించి జలరక్షణ పనులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అనపర్తి నియోజవకర్గంలో కాలువల్లో పూడికతీత, చెరువులు, పంట బోదెల పనులు ఎక్కువగా చేస్తున్నారు.


రంగాపురంలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలు

కూలి పెంచడం సంతోషం



మాకు ఉపాధి పనులే దిక్కు. ప్రభుత్వం రోజుకి రూ.257 కూలీగా ఇచ్చేది. దానికి అదనంగా రూ.15 పెంచిందని అధికారులు చెప్పారు. ప్రభుత్వం కూలీల కష్టాన్ని గుర్తించి కూలి పెంచడం సంతోషం.
– తొండాపు కృష్ణ, ఉపాధి కూలీ, పందలపాక

కష్టానికి ప్రతిఫలం



ఉపాధి కూలి గతంలో రూ.257 వచ్చేది. దానికి మరో రూ.15 పెంచి రూ.272 ఇవ్వనుండటం సంతోషం. కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తోంది. కూలి డబ్బులను ప్రభుత్వం సకాలంలో అందిస్తోంది.
– జగలింకి వెంకటరావు, ఉపాధి కూలీ, పందలపాక

అందరికీ పని కల్పిస్తున్నాం



జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పిస్తున్నాం. పెరిగిన వేతనాలను కూలీలకు వివరించాం. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల మేరకు పనిచేస్తే రోజుకు రూ.272 వేతనం లభిస్తుంది.
– జి.వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీవో, బిక్కవోలు

పేదల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి


నిడిగట్లలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నిడిగట్లలో గడప గడపకూ..

మధురపూడి: పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగన్‌కు అందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో మూడోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, బడుగుల అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు అందుకుంటున్నారన్నారు. కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొంటూ సంక్షేమ పథకాలను అమలు జరిపారన్నారు. నిడిగట్లలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. దీనిలో భాగంగా సుమారు వంద గడపలకు వెళ్లిన ఎమ్మెల్యే.. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, పార్టీ నాయకులు నాళం రోషయ్య, యడ్ల సత్యనారాయణ, పళ్ల కృష్ణ పాల్గొన్నారు.

29 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

అనపర్తి: మండలంలోని పొలమూరులో పునర్నిర్మించిన రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహాలతో పాటు, వివిధ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఈ నెల 29 నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 29న సంకల్ప దీక్ష, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, కంకణధారణ జరుగుతాయని నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 30న నవకలశ స్నపన, పంచగవ్యాధివాసం, మే 1న అగ్నిప్రణయనం, క్షీరాధివాసం, అధివాస హోమం, 2న జలాధివాసం, నయనాధివాసం, 3న యంత్రస్థాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, అన్నప్రసాద వితరణ అనంతరం సాయంత్రం రుక్మిణి సత్యభామా సమేత మదనగోపాలస్వామి వార్ల శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ జీర్ణోద్ధరణ, మహా సంప్రోక్షణకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, పార్టీ నాయకుడు సత్తి వెంకటరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

చలివేంద్రం ప్రారంభం

రంగంపేట: వేసవిలో దాహార్తిని తీర్చుకునేందుకు బాటసారులకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్ అన్నారు. రంగంపేట సినిమా హాలు సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ మండల క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కుసుమంచి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం చలివేంద్రంలో ఏర్పాటుచేసిన మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నలమాటి కాంతరత్నం, భవిరిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న కొల్లాటి ఇజ్రాయిల్

నేడు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని పర్యటన

మధురపూడి: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సోమవారం కోరుకొండ మండలంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కోటికేశవరంలో నాడు –నేడు పథకంలో తీర్చిదిద్దిన పీహెచ్‌సీని మధ్యాహ్నం 1.45 గంటలకు ప్రారంభిస్తారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీరంగపట్నంలోని కళాకారులు, క్షతగాత్రుల కుటుంబాలకు 2.30 గంటలకు చెక్కులు పంపిణీ చేస్తారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేస్తారు.

బహిరంగ సభకు చురుగ్గా ఏర్పాట్లు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం కళాకారులకు సోమవారం ప్రభుత్వం తరఫున సహాయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖమంత్రి విడదల రజిని అందజేయనుండడం అభినందనీయమని పంచాయతీ సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ అన్నారు. ఇటీవల కళాప్రదర్శనల నిమిత్తం విశాఖ జిల్లాకు వెళ్లి, తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తూ నలుగురు కళాకారులు మృతి చెందారు. మరో ఏడుగురు క్షతగాత్రులయ్యారు. మృతుల కుటుంబాలను ఓదార్చడంతో పాటు, క్షతగాత్రులకు పూర్తిస్థాయి వైద్యం అందించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సోదరుడు జక్కంపూడి గణేష్‌కు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నిర్వహించబోయే బహిరంగసభకు సంబంధించి ఆదివారం సన్నాహాలు ప్రారంభించారు. వాటిని పార్టీ నాయకులు మద్దాల రమణ, ఎంపీటీసీ సభ్యులు నూకరాజు, నానాజీ, నాయకులు కృష్ణ, సూర్యనారాయణ, నానాజీ తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా స్కూల్ వార్షికోత్సవం

మధురపూడి: కోరుకొండలోని షిరిడీ సాయి స్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. పదో తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ సందర్భంగా ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ గరగ లక్ష్మీ పద్మావతి, సత్యం శ్యామల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన నృసింహస్వామి తీర్థమహోత్సవాలు

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో కొలువైన సింహవల్లి రాజ్యలక్ష్మీ సమేత వరాహలక్ష్మీ నృసింహస్వామి తీర్థమహోత్సవాలు ముగిశాయి. ఈ నెల 19న ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం స్వామివారి నిజరూప దర్శనంతో ముగిశాయి. చివరి రోజు కావడంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన చిన్నారులు 108 కలశాలతో అభిషేక జలాలు తీసుకువచ్చారు. అభిషేకం అనంతరం గంధోత్సవం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో డప్పులు, బాణసంచా కాల్పుల నడుమ పైడితల్లి గ్రామోత్సవం కన్నులపండుగా జరిగింది.

భారీ వర్షం.. రైతుకు నష్టం


అనపర్తి సావరంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు


సంపత్‌నగరంలో తడిసిన ధాన్యం బస్తాలు


నల్గొండలో ధాన్యం కళ్లాలను పరిశీలిస్తున్న ఏవో సూర్యరమేష్

అనపర్తి: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనాన్నిచ్చింది. అయితే అకాల వర్షంతో పొలాల్లో, కళ్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోవడంతో అదికాస్తా రంగుమారి ధర తగ్గుతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టుకోవడానికి రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు.

రంగంపేట: మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షం కారణంగా పలుచోట్ల తోటల్లో మామిడి కాయలు నేలరాలిపోయాయి. దీంతో మామిడి తోటలు పాడుకున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వర్షానికి మామిడికి మాగు తెగులు వచ్చే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే పామాయిల్, నిమ్మ, జీడి మామిడి, కూరగాయ పంటలకు మాత్రం ఈ వర్షం మేలు చేస్తుందంటున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షం వల్ల ఎక్కడికక్కడ విద్యుత్ వైర్లు తెగి పడడంతో సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అనుకోని వర్షంతో రైతన్నల ఇక్కట్లు

రాజానగరం: తెల్లవారుజామున అకస్మాత్తుగా కురిసిన వర్షంతో రైతులు ఇబ్బంది పడ్డారు. రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలలో సుమారు 575 ఎకరాలలో వరి పంట కోసిన రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. యంత్రాలతో కోతలు కోసి, వెనువెంటనే బస్తాలలోకి ఎత్తి మిల్లర్లకు విక్రయించే పరిస్థితులు ఉన్నాగాని, బస్తాలలోకి ఎక్కించిన ధాన్యం రవాణా అవడంలో జాప్యం జరగడంతో ఈ పరిస్థితులు ఎదురయ్యాయి. ప్రభుత్వం కూడా ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్న తరుణంలో కొంతమంది రైతులు ఆరుదల కోసం రాశులుగా పోసి పొలాల్లోనే ఉంచారు. ఆ విధంగా ఉంచిన ధాన్యం రాశులు కూడా వరుణుడి ప్రతాపానికి గురికావడంతో అన్నదాతలు కాస్తోకూస్తో నష్టపోక తప్పడం లేదు. ఈ విధంగా తడిచిన ధాన్యాన్ని వాతావరణం అనుకూలిస్తే ఆరబోసి, ఆపై విక్రయించాల్సివస్తోందన్నారు.


చంద్రేడులో ఆదివారం ఉదయం కురుస్తున్న వర్షం

మామిడి తోటలకు నష్టమే..

ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మామిడి కాయలు రాలిపోయాయని, మంచి ధర వస్తుందని ఎదురుచూస్తున్న తమ ఆశలు ఆడియాశలయ్యాయని ఆయా తోటల రైతులు, కొనుగోలుదార్లు ఆవేదన చెందుతున్నారు, నియోజకవర్గంలోని మూడు మండలాలలో ఈ విధంగా సుమారు 255 ఎకరాలలో మామిడి తోటలు దెబ్బతిన్నాయని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు తమ పంటలను ఒబ్బిడి చేసుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖాధికారి కె.సూర్య రమేష్ సూచించారు. నల్గొండ, వంగలపూడి, చినకొండేపూడి గ్రామాల్లోని ధాన్యం కళ్లాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా మిల్లర్లుతో మాట్లాడి ధాన్యం బస్తాలు తీసుకువెళ్లడానికి లారీలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు కాటవరం, చినకొండేపూడి, రఘుదేవపురం-3, మిర్తిపాడు ఆర్బీకేల ద్వారా 89 మంది రైతుల నుంచి 678.88 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు.


గోకవరంలో మేఘావృతమైన ఆకాశం

వర్షంతో ఉపశమనం

గోకవరం: గత వారం రోజులుగా వేసవి తాపంతో ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు ఆదివారం కాస్త సేదతీరారు. మండల వ్యాప్తంగా తెల్లవారుజామున చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండడంతో వాతావరణం చల్లగా ఉంది. కాగా వాతావరణ మార్పులతో రబీ వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.